రేపు డీఆర్‌సీ సమావేశం

పార్వతీపురం, డిసెంబరు7 (ఆంధ్రజ్యోతి): పార్వతీపురం ఐటీడీఏ గిరిమిత్ర సమావేశ మందిరంలో ఈ నెల 9న జిల్లా సమీక్షా సమావేశం (డీఆర్‌సీ) నిర్వహించనున్నట్లు కలెక్టర్ ఎ.శ్యామ్ ప్రసాద్ తెలిపారు. శనివారం కలెక్టరేట్‌లో సంబంధిత అధికారులతో ఆయన మాట్లాడుతూ.. జిల్లా ఇన్‌చార్జి మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు అధ్యక్షతలో సమావేశం జరుగుతుందని తెలిపారు. మంత్రి గుమ్మిడి సంధ్యారాణి, ఎమ్మెల్యేలు, ఇతర ప్రజాప్రతినిధులు హాజరవుతారని చెప్పారు. అన్ని శాఖల అధికారులు ఉదయం 11 గంటల లోగా పూర్తి సమాచారంతో హాజరు కావాలని కలెక్టర్ ఆదేశించారు.

- జిల్లావ్యాప్తంగా 1,550 పాఠశాలల్లో పీటీఎం నిర్వహణ
- వివిధ అంశాలపై విద్యార్థుల తల్లిదండ్రులు, ఉపాధ్యాయుల చర్చ
- భాగస్వాములైన అధికారులు, ప్రజాప్రతినిధులు
- ఆకట్టుకున్న క్రీడాపోటీలు, సాంస్కృతిక ప్రదర్శనలు

సందడిగా..



టగ్ ఆఫ్ వార్‌లో పాల్గొన్న మంత్రి సంధ్యారాణి

పార్వతీపురం/ మక్కువ, డిసెంబరు7 (ఆంధ్రజ్యోతి): జిల్లావ్యాప్తంగా ప్రభుత్వ పాఠశాలల్లో శనివారం ఉపాధ్యాయులు, తల్లిదండ్రుల సమావేశాలను (పీటీఎం) ఘనంగా నిర్వహించారు. దీంతో అంతటా సందడి వాతావరణం నెలకొంది. గతంలో ఎప్పుడూలేని విధంగా 1,550 పాఠశాలల్లో ఒకేరోజున నిర్వహించిన ఆత్మీయ సమావేశాల్లో పూర్వ విద్యార్థులు, అధికారులు, ప్రజాప్రతినిధులు భాగస్వాములయ్యారు. పాఠశాలల్లో వసతులు, విద్యా ప్రమాణాలు, మధ్యాహ్న భోజనాలు, హోలిస్టిక్ ప్రోగ్రెస్ కార్డులు, నైతిక విలువలు తదితర అంశాలపై వారు చర్చించారు. అనంతరం విద్యార్థుల తల్లిదండ్రులకు టగ్ ఆఫ్ వార్, రంగవల్లుల, వాలీబాల్, టెన్నికాయిట్, తదితర క్రీడా పోటీలు నిర్వహించారు. మక్కువ జడ్పీ ఉన్నత పాఠశాలలో నిర్వహించిన మెగా పేరెంట్స్-టీచర్స్ మీట్‌కు మంత్రి గుమ్మిడి సంధ్యారాణి హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు విద్యార్థులపై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. పిల్లల్లో అభ్యసన సామర్థ్యాలను పెంచాలని, వారి సమస్యలు, పరివర్తనను నిశితంగా గమనించాలని సూచించారు. ఫోన్‌కు దూరంగా ఉంచాలన్నారు. తల్లిదండ్రులు కూడా తమ పిల్లలకు ఆట పాటలతో పాటు పెద్దలకు ఇవ్వాల్సిన గౌరవం తదితర అంశాలను తెలియజేయలన్నారు. సైబర్ నేరాలు, మాదకద్రవ్యాలపై పాఠశాలల్లో అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని ఆదేశించారు. తాను ఇదే పాఠశాలలో చదువుకున్నానని, స్కూల్ అభివృద్ధి, మౌలిక సదుపాయాల కల్పనకు పూర్తి స్థాయిలో సహకారం అందిస్తామని తెలిపారు. అనంతరం తనకు విద్య నేర్పిన గురువు రెడ్డి సత్యమూర్తికి పాదాభివందనం చేశారు. ఈ కార్యక్రమంలో భాగంగా విద్యార్థుల తల్లిదండ్రులకు వివిధ క్రీడా పోటీలు నిర్వహించారు. మరోవైపు విద్యార్థినులు సాంస్కృతిక ప్రదర్శనలతో అందర్నీ అలరించారు.

- పాలకొండ నియోజకవర్గం సీతంపేట ప్రభుత్వ గిరిజన సంక్షేమ ఆశ్రమ ఉన్నత పాఠశాల (బాలుర)లో నిర్వహించిన మెగా పేరెంట్స్-టీచర్స్ మీట్‌లో ఎమ్మెల్యే నిమ్మక జయకృష్ణ పాల్గొన్నారు. ప్రభుత్వ విప్, కురుపాం ఎమ్మెల్యే తోయక జగదీశ్వరి గుమ్మలక్ష్మీపురం జడ్పీ ఉన్నత పాఠశాల, భద్రగిరి గిరిజన సంక్షేమ ఆశ్రమ పాఠశాలల్లో నిర్వహించిన సమావేశాలకు హాజరయ్యారు.

లక్ష్యాల సాధనకు కృషి: కలెక్టర్

బెలగాం: ఉన్నత లక్ష్యాల సాధనకు విద్యార్థులు కృషి చేయాలని.. పట్టుదలతో చదవాలని కలెక్టర్ ఎ.శ్యామ్‌ప్రసాద్ సూచించారు. డీవీఎం పాఠశాలలో ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రు లతో నిర్వహించిన ఆత్మీయ సమావేశంలో ఆయన మాట్లాడుతూ విద్యార్థులకు తల్లిదండ్రులే మార్గ దర్శకులన్నారు. పిల్లలపై ఎటువంటి అనుమానాలున్నా ఉపాధ్యాయులను అడిగి తెలుసుకోవాలని సూచించారు. అనంతరం పాఠశాల ఎలా ఉంది, ఉపాధ్యాయులు చక్కగా బోధిస్తున్నారా లేదా, మధ్యాహ్న భోజనం ఎలా ఉందని విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. చదువు ఒక్కటే కాదని, క్రీడల్లోనూ ప్రతిభ చూపాలని సూచించారు. గంజాయి వంటి మాదక ద్రవ్యాలు ఎవరికైనా కనబడితే 1972కి ఫోన్ చేయలన్నారు.



విద్యార్థుల తల్లిదండ్రులతో మాట్లాడుతున్న కలెక్టర్ శ్యామ్‌ప్రసాద్



మాట్లాడుతున్న ఎస్పీ మాధవరెడ్డి

మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలి : ఎస్పీ

సాలూరు రూరల్/సాలూరు: 'విద్యార్థులు మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలి. ముఖ్యంగా గంజాయికి ఆకర్షితులు కావొద్దు. పిల్లలను తల్లిదండ్రులు నిరంతరం గమనించాలి. వారి ప్రవర్తనలో మార్పులు కన్పిస్తే ఆరా తీయాలి.' అని ఎస్పీ మాధవరెడ్డి తెలిపారు. సాలూరు ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో జరిగిన మెగా పీటీఎంకు ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. జిల్లా సరిహద్దులో ఉన్న ఒడిశా నుంచి గంజాయి దిగుమతి కాకుండా సరిహద్దుల్లో చెక్‌పోస్టులను ఏర్పాటు చేశామన్నారు. సైబర్ నేరాల నిరోధానికి అందర సహకరించాలన్నారు.

గిట్టుబాటు కావట్లే!

- క్వింటాకు సుమారు రూ.1200 నష్టం
- లబోదిబో మంటున్న పత్తి రైతులు
- సమీపంలో లేని కొనుగోలు కేంద్రాలు
- తప్పనిసరి పరిస్థితుల్లో దళారులకే పంట విక్రయం

గుమ్మలక్ష్మీపురం, డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో పత్తి రైతుల పరిస్థితి దయనీయంగా మారింది. పంటకు గిట్టుబాటు ధర లేకపోవడంతో తీవ్ర ఆందోళన చెందుతున్నారు. కొనుగోలు కేంద్రాలు కూడా పూర్తిస్థాయిలో లేకపోవడంతో పత్తిని విక్రయించేం దుకు నానా అవస్థలు పడు తున్నారు. ఇదే అదునుగా దళారులు రంగ ప్రవేశం చేస్తున్నారు. ప్రభుత్వం ప్రకటించిన మద్దతు ధర కంటే తక్కువగా పంటను కొనుగోలు చేస్తున్నారు. తప్పనిసరి పరిస్థితుల్లో వారిని ఆశ్రయిస్తున్న పత్తి రైతులు క్వింటాకు సుమారు రూ.1200 చొప్పున నష్టపోతున్నారు.


ఇదీ పరిస్థితి..

జిల్లాలో సుమారు 12 వేల ఎకరాల్లో పత్తి సాగవుతోంది. అయితే వర్షాభావం, ప్రకృతి ప్రతికూల పరిస్థితుల నేపథ్యంలో ఆశించిన స్థాయిలో దిగుబడులు రాలేదు. చేతికందొచ్చిన పంటనైనా అమ్ముకుందామనుకుంటే.. గిరిజన, మైదాన ప్రాంతాల్లో రైతులకు అవస్థలు తప్పడం లేదు. గుమ్మలక్ష్మీపురంలో 760 ఎకరాలు, కురుపాం, జియ్యమ్మవలస, కొమరాడ మండలాల్లో సుమారు మూడు వేల ఎకరాలు, భామిని, సీతంపేట, దోనుబాయి మండ లాల్లో సుమారు ఎనిమిది వేల ఎకరాల్లో రైతులు పత్తి పంటను పండిస్తున్నారు. కాగా భామిని లేదా కురుపాంలో కొనుగోలు కేంద్రాలు లేవు. సాలూరులో కాటన్ కార్పొరేషన్ ఇండియా లిమిటెడ్ (సీసీఐఎల్) ఆధ్వర్యంలో కొనుగోలు కేంద్రానికి ఏర్పాటు చేసినప్పటికీ దాదాపు వంద కిలోమీటర్ల దూరంలో అది ఉండడంతో అక్కడకు రైతులు వెళ్లలేకపో తున్నారు. దూరాభారం కావడంతో ఒడిశా నుంచి వచ్చే దళారులకే పంటను విక్రయించాల్సి వస్తోంది. కాగా ప్రస్తుతం క్వింటా పత్తి మద్దతు ధర రూ.7521 ఉండగా దళారులు క్వింటా రూ.6,300కు మాత్రమే కొనుగోలు చేస్తున్నారు. దీంతో పత్తి రైతులు తీవ్రంగా నష్టపోతున్నారు. దీనిపై ప్రభుత్వం, ఉన్నతాధికారులు స్పందించి తగు చర్యలు తీసుకోవాలని రైతులు, గిరిజన సంఘాల నాయకులు కోరుతున్నారు. ఈ విషయంపై ఏవో ప్రసాదరావును వివరణ కోరగా.. కురుపాం లేదా భామినిలో పత్తి కొనుగోలు కేంద్రం ఏర్పాటు చేయాలని ఉన్నతాధికారులను కోరామన్నారు.



దళారులకు పత్తిని విక్రయిస్తున్న దృశ్యం





మందులతోనూ ముప్పు

- సన్నగిల్లనున్న రోగ నిరోధక శక్తి
- గుండెపై దుష్ప్రభావం
- మందుల షాపులపై ఆధార పడకూడదు
- వైద్యుల సూచనలు పాటించాలి



6లో

వెంకన్న సేవలో భక్తజనం

- తోటపల్లి కిటకిట

6లో



ఈ పల్లె పడుచు... ఓ బ్యాంకు డైరెక్టర్

- న్యూయార్క్‌లో విధులు
- వాడాడ వనితకు ప్రత్యేక గుర్తింపు

6లో

రైతుల సంక్షేమమే ధ్యేయం

- పౌరసరఫరాల శాఖ మంత్రి మనోహర్

బెలగాం/ పార్వతీపురం రూరల్, డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి): రైతుల సంక్షేమమే ధ్యేయంగా ప్రభుత్వం పని చేస్తుందని పౌర సరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ అన్నారు. శనివారం పెదబొండపల్లి గ్రామంలో పర్యటించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే విజయచంద్రతో కలిసి పొలంలో వరి కుప్పలను పరిశీలించారు. ఎంత ధాన్యం దిగుబడి వస్తుంది.. ఖర్చు ఎంతవుతుందనే విషయాలను రైతులను అడిగి తెలుసుకున్నారు. మారుతన్న పరిస్థితులకు అనుగుణంగా సాగు చేపట్టాలని సూచించారు. కొత్త విధానాలతో ముందుకు సాగాలన్నారు. రైతే రాజు అనే నినాదంతో ఈ ప్రభుత్వం ముందుకెళ్తుందని తెలిపారు. అనంతరం పెదబొండపల్లిలోని రైతు సేవా కేంద్రంలో ధాన్యం కొనుగోలు పరికరాలను పరిశీలించారు. ధాన్యం కొనుగోలుపై ప్రభుత్వం విధానం ఎలా ఉందని అన్నదాతలను అడిగి తెలుసుకున్నారు. ఇప్పటికే సబ్సిడీపై టార్పాలిన్లు అందించిన విషయాన్ని గుర్తు చేశారు. అన్నదాతల సమస్యలు ప్రభుత్వా నికి తెలుసని, ఆర్థిక భారం ఉన్నా వారి సమస్యలు పరిష్కరించేందుకు కృషి చేస్తుందని చెప్పారు. ఉత్తరాంధ్ర సాగునీటి ప్రాజెక్టులు, నదుల అనుసంధానంపై సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్‌కు అవగాహన ఉందని, ప్రతి నీటిని ఒడిసి పట్టి సాగునీరు అందించేందుకు ప్రణాళికలు రూపొందిస్తున్నారని తెలిపారు.

విద్యా రంగానికి అధిక ప్రాధాన్యం

విద్యారంగానికి ప్రభుత్వం అధిక ప్రాధాన్యం ఇస్తుందని మంత్రి నాదెండ్ల మనోహర్ తెలిపారు. నర్సిపురం ఉన్నత పాఠశాలలో నిర్వహించిన మెగా పేరెంట్స్ డే కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ.. ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక వసతులు ఉన్నాయని, ఉపాధ్యాయులు అంకిత భావంతో పని చేయాలని సూచించారు. పిల్లలు క్రీడల్లో పాల్గొనేలా తల్లిదండ్రులు ప్రోత్సహించాలని కోరారు. గత వైసీపీ ప్రభుత్వం నిర్లక్ష్యం వల్ల విద్యావ్యవస్థ గాడి తప్పిందన్నారు. సీఎం చంద్రబాబు, డిప్యూటి సీఎం పవన్ కల్యాణ్ ఆధ్వర్యంలో రాష్ట్రం అభివృద్ధి పథంలో ముందుకెళ్తుందన్నారు. ఎమ్మెల్యే విజయచంద్ర మాట్లాడుతూ కష్టపడితే సాధించలేనిదంటూ ఏదీ లేదన్నారు. నర్సిపురంలో ఓ సాధారణ కుటుంబంలో పుట్టిన తాను ఎమ్మెల్యేగా ఎదిగానని, ఇంతటి అవకాశం ఇచ్చిన ఈ ప్రాంతవాసులకు రుణపడి తెలిపారు. ఈ సారి కూడా పదో తరగతి పరీక్ష ఫలితాల్లో జిల్లా ప్రథమ స్థానంలో నిలవాలన్నారు. అనంతరం కలెక్టర్ ఎ.శ్యామ్‌ప్రసాద్ విద్యార్థులతో కలిసి మధ్యాహ్న భోజనం చేశారు.



రైతులతో మాట్లాడుతున్న మంత్రి మనోహర్

కుక్కల దాడిలో
వృద్ధురాలి మృతి

- శోక సంద్రంలో కుటుంబ సభ్యులు
- వెంకటరాజపురంలో విషాదం
- వరుస ఘటనలతో బెంబేలెత్తిపోతున్న గ్రామస్థులు

జియ్యమ్మవలస, డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి): జియ్యమ్మవలస మండలం వెంకటరాజపురం గ్రామంలో శనివారం సాయంత్రం శునకాల దాడిలో ఓ వృద్ధురాలు మృతి చెందింది. దీంతో కుటుంబ సభ్యులు శోకసంద్రంలో మునిగి పోయారు. వివరాల్లోకి వెళ్తే.. గ్రామానికి చెందిన కండేని పారమ్మ (70) రోజూలానే శనివారం కూడా పొలానికి వెళ్లింది. సాయంత్రం ఇంటికి తిరుగు ప్రయాణమవుతున్న సమయంలో మార్గమధ్యంలో ఒకేసారి నాలుగు కుక్కలు ఆమెపై దాడి చేశాయి. దీంతో వృద్ధురాలు అక్కడికక్కడే మృతి చెందింది. పొలంలో విగతజీవిగా పడి ఉన్న పారమ్మను స్థానికులు చూసి కుటుంబ సభ్యులకు సమాచారం అందించారు. దీంతో వారు హుటాహుటిన అక్కడకు చేరుకుని కన్నీరుమున్నీరయ్యారు. మృతురాలికి కుమారుడు, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. కాగా ఈ ప్రాంతంలో ఇప్పటివరకు కుక్కల దాడిలో ముగ్గురు చనిపోవడంతో స్థానికులు బెంబేలెత్తిపోతున్నారు. దీనిపై ఉన్నతాధికారులు స్పందించి తగు చర్యలు తీసుకోవాలని వారు కోరుతున్నారు.



పారమ్మ (ఫైల్)



ఫీల్డ్ అసిస్టెంట్లను ప్రశ్నిస్తున్న డ్వామా పీడీ

బీటీకి బదులు సీసీ రోడ్లా?

- సామాజిక తనిఖీల్లో వెలుగు చూసిన అక్రమాలు
- నిధులు దుర్వినియోగమైనట్లు గుర్తింపు
- రికవరీకి ఆదేశాలు

సీతంపేట రూరల్, డిసెంబరు 7(ఆంధ్రజ్యోతి): సీతంపేట మండలంలో గత ఏడాది ఉపాధి హామీ పథకం కింద చేపట్టిన పనుల్లో అక్రమాలు వెలుగుచూశాయి. ముఖ్యంగా గిరిజన గ్రామాల్లో బీటీ రహదారులకు బదులు సీసీ రోడ్లు నిర్మించడం చర్చనీయాంశమైంది. శనివారం స్థానిక మండల పరిషత్ కార్యాలయ ఆవరణలో డ్వామా పీడీ రామచంద్రరావు, ఎంపీడీవో కె.గీతాంజలి ఆధ్వర్యంలో సామాజిక తనిఖీ ప్రజావేదిక నిర్వహించారు. ఈ సందర్భంగా పలు పనులు, క్షేత్రస్థాయి సిబ్బంది తీరుపై ఉన్నతాధికారులు మండిపడ్డారు. ప్రధానంగా శిలగాం, కొండాడ గ్రామ పంచాయతీ పరిధిలో చేపట్టిన ఉపాధి పనుల్లో అధిక శాతం నిధులు దుర్వినియోగమైనట్లు డీఆర్‌పీలు గుర్తించారు. మిగిలిన పంచాయతీల్లో ఉపాధి కూలీల సంతకాలు, వేలిముద్రలు లేకుండా పేమెంట్‌లు చేయడంపై నివేదికలు అందించారు. అదేవిధంగా గొయ్యిగూడ నుంచి జోడుమానుగూడకి 'ఉపాధి'లో బీటీ రహదారి నిర్మాణానికి 2023లో రూ.43 లక్షలు మంజూరవగా.. ఐటీడీఏ ఇంజనీరింగ్ అధికారులు బీటీ బదులుగా సీసీ రహదారి నిర్మించినట్లు తేలింది. కోసంగి నుంచి లాడ గ్రామానికి కూడా రూ.33 లక్షలతో బీటీ రోడ్డు మంజూరవగా.. సీసీ రోడ్డు నిర్మించారు. అయితే వాటికి సంబంధించి ఆయా ఉపాధి సిబ్బందిని బాధ్యులను చేస్తూ డ్వామా పీడీ రికవరీకి ఆదేశించారు. కాగా గత ఏడాది ఉపాధిహామీ పథకం కింద 3,986 పనులు చేపట్టగా వాటిలో వేజెస్ కింద రూ.31.18 కోట్లు ఖర్చు చేసినట్లు చూపారు. మెటీరియల్ కాంపొనెంట్ కింద రూ.8.59 కోట్లు వెచ్చించినట్లు చూపారు. ఈ సామాజిక తనిఖీ ప్రజావేదికలో ఎంపీపీ ఆదినారాయణ, ఉపాధి ఏపీడీ శ్రీహరి, జిల్లా విజిలెన్స్ విభాగం అధికారి వెంకటరమణ, ఏపీవో సాగర్ పాల్గొన్నారు.

మందులతోనూ ముప్పు



● సన్నగిల్లనున్న రోగ నిరోధక శక్తి ● గుండెపై దుష్ప్రభావం ● మందుల షాపులపై ఆధార పడకూడదు ● వైద్యుల సూచనలు పాటించాలి

రాజాం రూరల్, డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి)

చిన్నపాటి తలనొప్పి.. పరిష్కారం ఓ మాత్ర. ఒళ్లు నొప్పులు... మరో మాత్ర. జలుబు.. మళ్లీ ఇంకొకటి. ఒంట్లో చిన్న నలతగా ఉంటే వెంటనే మందుల షాపునకు వెళ్లడం.. అక్కడి వారికి సమస్య చెప్పడం.. వారిచ్చిన మాత్రలు వినియోగించడం.. ఇదీ జిల్లాలో చాలామంది చేస్తున్న పని. మందుల వినియోగం విచ్చలవిడిగా పెరిగిపోయిందనడానికి ఇవి ఉదాహరణలు. ఏ చిన్న సమస్య వచ్చినా వెంటనే మందులు వినియోగిస్తున్నారు. అది కూడా వైద్య నిపుణుల సలహా లేకుండా. తాత్కాలికంగా ఇది ఉపశమనం కలిగించినా... దీర్ఘకాలికంగా దుష్ప్రభావాలు అధికంగా ఉంటాయని ప్రజలు గుర్తించడం లేదు.



● ఆరోగ్య సమస్యలకు కారణం..

విచ్చలవిడిగా మాత్రల వినియోగం ప్రమాదానికి హేతువని వైద్య నిపుణులు హెచ్చరిస్తున్నారు. మైదాన ప్రాంతాల కన్నా మన్యంలో మందుల షాపులపై ఆధారపడడం అధికంగా ఉంది. నొప్పుల నివారణ (పెయిన్ కిల్లర్స్) మందులను విచక్షణా రహితంగా వాడితే ఒళ్లు గుల్లవడం ఖాయమని వైద్యులు చెబుతున్నారు. పెయిన్ కిల్లర్స్, మత్తు కలిగించే ఇంజక్షన్లు, యాంటీ బయాటిక్స్ శరీరాన్ని క్రమేపీ బలహీనం చేస్తాయని హెచ్చరిస్తున్నారు. ఎప్పుడు పడితే అప్పుడు మందుల వినియోగం ఎక్కువైతే చాలా సమస్యలు ఉత్పన్నమవుతాయని వైద్యులు చెబుతున్నారు.

● చిన్నారులకూ ఇబ్బందే..



చిన్నపిల్లలు అస్వస్థతకు గురైనప్పుడు వారికి సొంత వైద్యం చేయకూడదు. ప్రభుత్వ గుర్తింపు పొందిన వైద్యుడికి సకాలంలో చూపించాలి. వైద్యులు అందుబాటులో లేకపోతే తప్ప మందుల షాపుల్లో జబ్బు వివరాలు చెప్పి మందులు కొనుగోలు చేసి పిల్లలకు ఇవ్వకూడదు. ఇలా చేస్తే చిన్నారుల రోగ నిరోధక శక్తి సన్నగిల్లుతుంది.

-డా. కరణం హరిబాబు, చిన్నపిల్లల వైద్యులు

● జీర్ణ మండలంపై ప్రభావం



శరీరంలో ఏభాగంలో ఇబ్బందిగా ఉన్నా సంబంధిత వైద్యుడిని సంప్రదించాలి. వైద్యుడి సూచన, సలహాల మేరకే మందులు వాడాలి. బయట మార్కెట్లో లభించేవి, ప్రభుత్వ గుర్తింపులేని వ్యక్తులు ఇచ్చిన మందులు హాని కలిగిస్తాయి. అధికంగా కీళ్లనొప్పులు, తలనొప్పికి వినియోగించే మందులు జీర్ణమండలంపై ప్రభావం చూపి ఇతర వ్యాధులకు దారి తీస్తాయి. కిడ్నీపై ప్రభావం చూపుతాయి. కొన్ని సందర్భాలలో వాటి రసాయనాలు గుండె జబ్బులకు దారితీసే అవకాశం ఉంది. పారాసిటమల్ మాత్ర మినహా ఏ ఇతర మాత్రయినా వైద్యుడి సలహా మేరకు వాడాలి. లేకుంటే శరీరంలో ఏదో ఒక భాగంపై ప్రభావం పడే అవకాశాలే ఎక్కువ.

-డా. గార రవిప్రసాద్, రాజాం

● గర్భస్రావమయ్యే ప్రమాదం..

గర్భిణులు మంచి వైద్యుడిని ఆశ్రయించకుండా బయట దొరికే మాత్రలు వినియోగించడం ప్రమాదకరం. ప్రతి చిన్న సమస్యకూ మందులు తీసుకోవడం వల్ల కొన్నిసార్లు గర్భస్రావమయ్యే అవకాశాలు ఎక్కువగా ఉన్నాయి. సొంత వైద్యంతో అసలుకే ముప్పు వస్తుంది.

-డా.సూర్య శైలజ, గైనకాలజిస్ట్, రాజాం

● మహిళలకు కష్టం

ఇష్టారాజ్యంగా మందుల వినియోగం వల్ల మహిళల్లో దుష్ప్రభావం చూపే అవకాశాలు ఎక్కువ. వైద్య నిపుణుల సలహాలు లేకుండా మందులు వినియోగించడం వల్ల ఇబ్బందులు తప్పవు. కొన్నిసార్లు అవసరానికి మించిన డోసు వేసుకోవడం వల్ల మహిళల్లో తీవ్ర అనారోగ్య సమస్యలు తలెత్తుతాయి. ముఖ్యంగా రుతుక్రమం దెబ్బతింటుంది.

-డా.సత్యవాణి, గైనకాలజిస్ట్, రాజాం

● రోగ నిరోధక శక్తి తగ్గుతుంది..

కొన్నిరకాల మందులు, ఇంజక్షన్లు వాడడం వల్ల మెదడుపై ప్రభావం పడుతుంది. ఫలితంగా విచక్షణ.. మేధాశక్తి కోల్పోయే ప్రమాదం ఉంది. యాంటీ బయాటిక్స్ వినియోగంతో రోగ నిరోధకశక్తి క్షీణిస్తుంది. మెదడులో రక్తం గడ్డకట్టుకు పోయి రక్తనాళాలు చిట్లే ప్రమాదం ఉంది.

-డా.సిద్ధేశ్వరి, మెడికల్ ఆఫీసర్, బొద్దాం



కుటుంబ సభ్యులతో కొల్లి భారతి

ఈ పల్లె పడుచు... ఓ బ్యాంకు డైరెక్టర్

● న్యూయార్క్‌లో విధులు ● వాడాడ వనితకు ప్రత్యేక గుర్తింపు



కొల్లి భారతి

బాడంగి, డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి): అది ఓ మారుమూల గ్రామం. పేరు వాడాడ. ఆ గ్రామం పేరు ఇప్పుడు అనేక మంది నోట నానుతోంది. దీనికి కారణం ఆ ఊరికి చెందిన విశ్రాంత ఆర్మీ అధికారి కొల్లి సంహాచలం, లక్ష్మీ దంపతుల కుమార్తె కొల్లి భారతి. ప్రపంచంలోనే అతి పెద్ద బ్యాంకులలో ఒకటైన ఇండస్ట్రియల్ అండ్ కమర్షియల్ బ్యాంక్ ఆఫ్ చైనాకు డైరెక్టర్ స్థాయికి చేరుకుంది భారతి. ప్రస్తుతం అమెరికాలోని న్యూయార్క్‌లోని సంస్థ కార్యాలయంలో ఆమె విధులు నిర్వహిస్తున్నారు. 2020లో ఐసీబీసీలో చేరిన ఆమె ఈ ఏడాది డైరెక్టర్ స్థాయికి ఎదిగారు. భారతికి ఫైనాన్షియల్ సర్వీసెస్ రంగంలో దశాబ్దానికి పైగా అనుభవం ఉంది. ఫార్చ్యూన్ 100 క్లయింట్లతో కలిసి వ్యాపార వృద్ధి, ఖర్చుల ఆదా, రిస్క్ మేనేజ్‌మెంట్‌ను మెరుగుపరిచే పరిష్కారాలను అందించారు. గతంలో ఆమె డెలాయిట్ కన్సల్టింగ్‌లో డేటా మేనేజర్‌గా, డెల్ సర్వీసెస్‌లో సాఫ్ట్‌వేర్ డెవలప్‌మెంట్, హెవ్లెట్ ప్యాకర్డ్ ఎంటర్‌ప్రైజెస్ అడ్వైజర్‌గా పని చేశారు. డ్యూక్ యూనివర్సిటీ నుంచి కార్పొరేట్ స్ట్రాటజీ, వెంచర్ క్యాపిటల్, ప్రైవేట్ ఈక్విటీ, డిజిటల్ ప్లాట్‌ఫారమ్‌లలో మాస్టర్ ఆఫ్ బిజినెస్ అడ్మినిస్ట్రేషన్‌లో పట్టా పొందారు. జవహర్‌లాల్ నెహ్రూ టెక్నలాజికల్ యూనివర్సిటీ నుంచి ఎలక్ట్రికల్, ఎలక్ట్రానిక్స్ ఇంజనీరింగ్‌లో గ్రాడ్యుయేట్ డిగ్రీ పూర్తి చేశారు. చిన్న గ్రామం నుంచి అత్యంత ప్రముఖ బ్యాంక్ డైరెక్టర్‌గా ఎంపిక కావడం పట్ల కుటుంబ సభ్యులు కొల్లి సత్యం, రాధ, మంజుల, ఈశ్వరరావు, రెడ్డి రామచంద్రరావు, రాములు, గ్రామ ప్రజలు, నాయకులు అభినందనలు తెలిపారు.

ఆద్యంతం... ఆహ్లాదం!

● పండుగలా మెగా పేరెంట్, టీచర్ సమావేశం

● అలరించిన పూర్వ విద్యార్థుల నృత్యాలు ● పిల్లలతో కలెక్టర్ ముచ్చట్లు



విద్యార్థినుల కర్రసాము



చేతిపై అరటికాయ ఉంచి కత్తితో నరుకుతున్న దృశ్యం



రంగవల్లుల పోటీల్లో పాల్గొన్న విద్యార్థుల తల్లులు

విజయనగరం రూరల్, డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా... రాష్ట్ర వ్యాప్తంగా ఒకే సమయంలో నిర్వహించిన మెగా టీచర్స్, పేరెంట్స్ మీట్ కార్యక్రమం శనివారం విజయనగరం జిల్లాలో ఆహ్లాదకరంగా సాగింది. మలిచర్ల గ్రామంలోని జిల్లా పరిషత్ హైస్కూల్‌లో ఈ కార్యక్రమానికి కలెక్టర్ బీఆర్ అంబేడ్కర్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఉపాధ్యాయులు, విద్యార్థులు, తల్లిదండ్రులు, పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం ఉత్సాహంగా సాగింది. తల్లులకు రంగోలి, తండ్రులకు టగ్ ఆఫ్ వార్ పోటీలను నిర్వహించారు. తల్లిదండ్రులకు మెగా వైద్య శిబిరం నిర్వహించి, మందులు పంపిణీ చేశారు. అనంతరం తల్లిదండ్రులు, విద్యార్థులతో కలిసి కలెక్టర్ అంబేడ్కర్ సహపంక్తి భోజనం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భవిష్యత్తుకు చదువే ఆధారమని అన్నారు. జిల్లా వ్యాప్తంగా 1796 పాఠశాలల్లో ఒకే సమయంలో ఈ కార్యక్రమం నిర్వహిస్తున్నట్టు తెలిపారు. ప్రతి విద్యార్థి తల్లిదండ్రులకు వారి చదువు, ఆరోగ్యం, సమగ్ర సమాచారం అందించామన్నారు. పదో తరగతి పిల్లలతో ముచ్చటించి... ప్రతి ఒక్కరూ తప్పకుండా పాసవుతామని మాట ఇవ్వాలని కోరారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు సుజాత, సర్పంచ్ రమాకుమారి, పాఠశాల కమిటీ ఛైర్మన్ కర్రోతు శ్రీనివాసరావు, ఎంఈఓ సత్యవతి, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

విద్యార్థులతో మమేకమై..

మలిచర్ల స్కూల్ విద్యార్థులతో కలెక్టర్ అంబేడ్కర్ మమేకమయ్యారు. కొద్ది సేపు ఉపాధ్యాయుడిలా వారికి చదువు చెప్పారు. జనరల్ నాలెడ్జ్ ప్రశ్నలు సంధించారు. అలాగే వారితో కలిసిపోయారు.. విద్యార్థులతో బెంచీపై కూర్చొని మాట్లాడారు. తానూ ఒకప్పుడు విద్యార్థినేనని... కష్టపడి చదివి, తల్లిదండ్రుల సహకారంతో ఈ స్థానానికి ఎదిగానని చెప్పారు. భవిష్యత్తులో ఉన్నత స్థానాలను అధిరోహించాలని విద్యార్థులను ఆయన ఆశీర్వదించారు.



విద్యార్థుల ప్రోగ్రెస్ రిపోర్టును పరిశీలిస్తున్న కలెక్టర్ అంబేడ్కర్

వెంకన్న సేవలో భక్తజనం

● తోటపల్లి కిటకిట



పూజలు అందుకుంటున్న స్వామివారి ఉత్సవమూర్తులు

గరుగుబిల్లి, డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి): చినతిరుపతిగా ప్రసిద్ధిగాంచిన తోటపల్లి శ్రీవెంకటేశ్వర, కోదండరామ స్వామి ఆలయాలకు శనివారం భక్తుల తాకిడి అధికంగా కనిపించింది. శనివారం కావడంతో పరిసర ప్రాంతాల నుంచి అధిక సంఖ్యలో భక్తులు స్వామి వారిని దర్శించుకునేందుకు తరలివచ్చారు. ముందుగా ఉభయ దేవాలయాల్లో ప్రధాన అర్చకులు వీవీ అప్పలాచార్యులు ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం సర్వ దర్శనానికి అనుమతించారు. స్వామివారికి మొక్కులు తీర్చుకొనేందుకు వచ్చిన భక్తులతో కేశ ఖండనశాల కిక్కిరిసింది. భక్తులకు ఉచిత ప్రసాదాలతో పాటు అన్నసమారాధన చేశారు. ఆలయ ప్రాంగణం గోవింద నామస్మరణతో మార్మోగింది. ఈవో వీవీ సూర్యనారాయణ, సిబ్బంది జి.శ్రీధర్‌నాయుడు, తదితరులు పాల్గొన్నారు.



స్వామి వారి దర్శనానికి బారులుదీరిన భక్తులు

తీపి గురుతులను వదిలేశారు

రాజాం రూరల్, డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి): చారిత్రక కట్టడాలను పరిరక్షించాల్సిన అధికార యంత్రాంగం ఆ దిశగా దృష్టి పెట్టడం లేదు. చరిత్రకు సాక్ష్యంగా నిలిచిపోయే కట్టడాలు శిథిలమవుతున్నా అటు వైపు కన్నెత్తి చూడడం లేదు. మహనీయుల గొప్పతనానికి... వారి అనుబంధాలకు చిహ్నాలుగా నిలుస్తున్న వాటికి చెదలు పడుతున్నా పట్టించుకోవడం లేదు. అక్కడితో ఆగకుండా చారిత్రక కట్టడాలను వ్యర్థాలకు నిలయంగా మారుస్తున్నారు. ఈ కోవకు చెందినవే రాజాంలో బొబ్బిలి రాజుల కాలంలో నిర్మించిన తాండ్రపాపారాయుడి కోట, ఠాణా తదితర భవనాలు. చారిత్రక ఆనవాలుగా శోభాయమానంగా వెలుగొందిన కోటలో దశాబ్దాల పాటు కోర్టు సముదాయాన్ని, ఠాణా (జైలు)ను దశాబ్దాల పాటు తహసీల్దార్ కార్యాలయంగా వినియోగించారు. తహ సీల్దార్ కార్యాలయాలు, న్యాయస్థానాలకు భవనాలు నిర్మించిన నేపథ్యంలో పురాతన కట్టడాలు రోజురోజుకూ రూపురేఖలు కోల్పోతున్నాయి. కోర్టు సముదాయంలోని కోట భవనాలు శిథిలమవుతుండగా... ఠాణా వీధిలోని జైలు భవనాన్ని వ్యర్థాలను నిల్వ చేసేందుకు మున్సిపల్ అధికారులు వినియోగిస్తున్నారు. భావితరాలకు బొబ్బిలి రాజుల సంస్కృతి, సంప్రదాయాలు, తాండ్రపాపారాయుడి శౌర్యం తెలిసే విధంగా ఈ భవనాలను పరిరక్షించాలని ఈ ప్రాంతీయులు కోరుతున్నారు.



శిథిలావస్థలో తాండ్ర పాపారాయుడు కోట

కొండపైకి చేరేదెలా?

● శిథిలావస్థలో మెట్లు ● భక్తులకు కష్టాలు

నెల్లిమర్ల, డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి)

ప్రసిద్ధ పుణ్యక్షేత్రం రామతీర్థంలోని బోడికొండపై ఉన్న కోదండరాముని ఆలయం వద్దకు చేరేందుకు భక్తులు ఆపసోపాలు పడుతున్నారు. సుమారు 800 అడుగుల ఎత్తు ఉన్న ఈ బోడి కొండపైకి వెళ్లేందుకు 15 సంవత్సరాల క్రితం మెట్ల మార్గం నిర్మించారు. ఆ తర్వాత మెట్ల మరమ్మతులు గానీ... నిర్వహణ పనులు గానీ చేయలేదు. దీంతో మెట్లు ఎక్కడికక్కడ శిథిలావస్థకు చేరుకున్నాయి. కొండపై కోదండ రాముడిని దర్శించుకునేందుకు వెళ్లే భక్తులు మెట్ల మార్గం బాగోలేకతీవ్ర అవస్థలు పడుతున్నారు. కోదండరాముని ఆలయంలో ధూప దీప నైవేద్యాల సమర్పణకు నిత్యం అర్చకులు వెళ్తుంటారు. శివరాత్రి జాతర సమయాల్లో అధికారులు, ప్రజాప్రతినిధులు, వేలాది మంది భక్తులు కొండపైకి వెళ్తుంటారు. అయినప్పటికీ మెట్ల దుస్థితిని అధికారులు గుర్తించకపోవడం గమనార్హం. ఇప్పటికైనా మెట్లను పునర్నించేందుకు...మరమ్మతులు చేసేందుకు అధికారులు చర్యలు చేపట్టాలని ఈ ప్రాంతీయులు కోరుతున్నారు.



కోదండ రామాలయం





శిథిలస్థితిలో ఉన్న మెట్లు



ఈ దారిలో వెళ్లేదెలా?



లక్కవరపుకోట: జమ్మాదేవిపేట బాలికల గురుకుల పాఠశాలలో మాట్లాడుతున్న ఎస్.కోట ఎమ్మెల్యే కోళ్ల లలితకుమారి


రాజాం: పొగిరి ఉన్నత పాఠశాలలో మాట్లాడుతున్న రాజాం ఎమ్మెల్యే కోండ్రు మురళీమోహనరావు


డెంకాడ: రఘుమండ జడ్పీ ఉన్నత పాఠశాలలో మాట్లాడుతున్న నెల్లిమర్ల ఎమ్మెల్యే నాగమాధవి

విద్యతోనే పేదరిక నిర్మూలన సాధ్యం

● జిల్లావ్యాప్తంగా ప్రభుత్వ పాఠశాలల్లో మెగా పేరేంట్స్ - టీచర్స్ మీటింగ్స్



సంతకవిటి: మందరాడ జడ్పీ పాఠశాలలో మాట్లాడుతున్న ఏపీ ఉమెన్స్ కోఆపరేటివ్ కార్పొరేషన్ చైర్‌పర్సన్ కావలి గ్రీష్మ

విద్యతోనే పేదరిక నిర్మూలన సాధ్యమని ప్రజాప్రతినిధులు, అధికారులు తెలిపారు. శనివారం జిల్లావ్యాప్తంగా ప్రభుత్వ పాఠశాలల్లో మెగా పేరేంట్స్ - టీచర్స్ మీటింగ్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ విద్యార్థులను తీర్చిదిద్దాల్సిన బాధ్యత తల్లిదండ్రులు, ఉపాధ్యాయుల దేనని తెలిపారు. చీపురుపల్లిలోని బాలికోఉన్నత పాఠశాలలో జరిగిన మెగా పేరెంట్స్ సమావేశంలో తలిదండ్రుల అసహనం వ్యక్తంచేశారు. సమస్యలపై చర్చించని సమావేశాలు ఎందుకు నిర్వహించాలని తల్లిదండ్రులు ప్రశ్నించారు. ప్రభుత్వం ఇచ్చిన అజెండాలోని అంశాలతోపాటు పాఠశాల సమస్యలపై కూడా చర్చించాలని కోరారు. ఉపాధ్యాయులు, ప్రజాప్రతినిధులు ఒకరికొకరు పొగుడుకోవడం తప్ప, సమస్యలపై మాట్లాడనివ్వరా అని, కొంతమంది తల్లిదండ్రులు నిలదీశారు.

(ఆంధ్రజ్యోతి బృందం)



గరివిడి: పాత గరివిడి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మాట్లాడుతున్న టీడీపీ రాష్ట్ర కార్యదర్శి కిమిడి రామ్‌మల్లిక్‌నాయుడు



భోగాపురం: పోలిపల్లి ఉన్నత పాఠశాలలో మాట్లాడుతున్న మార్క్‌ఫెడ్ చైర్మన్ కర్రోతు బంగార్రాజు


శృంగవరపుకోట: ధర్మవరం జడ్పీ ఉన్నత పాఠశాలలో మాట్లాడుతున్న ఎమ్మెల్సీ ఇందుకూరి రఘురాజు


చీపురుపల్లి: బాలికోన్నత పాఠశాలలో ఉపాధ్యాయులను ప్రశ్నిస్తున్న తల్లిదండ్రులు

రంగప్ప చెరువు సర్వే


సర్వే చేపడుతున్న అధికారులు

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

రాజాం, డిసెంబరు 7(ఆంధ్రజ్యోతి):రంగప్ప చెరువులో ఆక్రమణలపై అధికారులు శనివారం సర్వే నిర్వహించారు. సర్వే నెంబరు 114లో గల చెరువులో ఏమేరకు ఆక్రమణలు గురైందో తెలుసుకోవడానికి పురపాలక సంఘం సర్వేయరు మరిపి సత్యనారాయణ ఆధ్వర్యంలో సర్వేచేపట్టారు. ఇటీవల ఆంధ్రజ్యోతిలో రంగప్ప చెరువును మింగేచారు శీర్షికతో కథనం ప్రచురితంకావడంతో జేసీ స్పందించారు. సర్వేచేసి నివేదిక అందజేయాలని ఆదేశాలు జారీచేయడంతో కమిషనర్ జె రామప్పలనాయుడు చర్యలు తీసుకొని సర్వేకు ఆదేశించారు. ఈ మేరకు చెరువులో ఆక్రమణదారులు ఉన్నట్లు గుర్తించారు. ఎంతమంది ఆక్రమణదారులు ఉన్నారో నివేదికలు తయారు చేస్తున్నట్లు సర్వేయరు సత్యనారాయణ తెలిపారు. ఆయనతోపాటు ఇంజనీరింగ్ సిబ్బంది కుమారు తదితరులు ఉన్నారు.

మెరుగైన సేవలందించాలి

● మంత్రి కొండపల్లి శ్రీనివాస్


మాట్లాడుతున్న మంత్రి శ్రీనివాస్

శృంగవరపుకోట, డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి): సచివాలయ ఉద్యోగులు ప్రజలకు మెరుగైన సేవలు అందించాలని ఎంఎస్ఎం, సెర్ప్, ఎన్నారై వ్యవహారాల శాఖ మంత్రి కొండపల్లి శ్రీనివాస్ కోరారు. శనివారం జామి మండలంలోని భీమసింగి గ్రామ సచివాలయ భవనాన్ని పారంభించారు. కార్యక్రమంలో ఎమ్మెల్సీ ఇందుకూరి రఘురాజు పాల్గొన్నారు.

సత్ప్రవర్తనతో మెలగాలి: సీఐ

విజయనగరంక్రైం,డిసెంబరు 7(ఆంధ్రజ్యోతి): పాత నేరస్థులు నేర ప్రవత్తిని విడనాడి, సత్ప్రవర్తనతో మెలగాలని వన్‌టౌన్ సీఐ శ్రీనివాస్ కోరారు. శనివారం విజయనగరం వన్‌టౌన్ పోలీసుస్టేషన్‌పరిధిలో పాత నేరస్థులు, షీట్లుఉన్నవారిని స్టేషన్‌కు పిలిపించి కౌన్సెలింగ్ నిర్వహించారు.ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ తరచూనేరాలకు పాల్పడితే, షీట్లు కొనసాగించిచర్యలు తీసుకుంటామని తెలిపారు. కార్యక్రమంలో ఎస్ఐ నరేష్ పాల్గొన్నారు.

ప్రతిభా పురస్కారాలకు విరాళం

రేగిడి, డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి): మండలంలోని సంకిలి ఉన్నతపాఠశాల విద్యార్థులకు విశ్రాంత ఉపాధ్యాయుడు, ఏపీటీఎఫ్ జిల్లా మాజీ అధ్యక్షులు చిన్నాల అచ్యుతరావు అండగా నిలిచాడు. తల్లిదండ్రుల ఆత్మీయ సమావేశానికి హాజరైన ఆయన పాఠశాల ప్రతిభ పురస్కారాలకు రూ.50వేలు విరాళం ప్రకటించారు. దీంతో హెచ్ఎం రామినాయుడుతోపాటు పలువురు అభినందించారు.

48 గంటల్లో ధాన్యం డబ్బులు

మెంటాడ,డిసెంబరు 7(ఆంధ్రజ్యోతి): రైతుల నుంచి సేకరించే ధాన్యానికి ప్రభుత్వం 48 గంటల్లోపే డబ్బులు చెల్లిస్తుందని తహసీల్దార్ కోరాడ శ్రీనివాసరావు తెలిపారు. శనివారం మెంటాడలో రైస్‌మిల్లర్లు, కస్టోడియన్ అధికారులతో సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా మాట్లాడుతూ మిల్లర్లు సరిపడా గోనె సంచులు సిద్ధంగా ఉంచాలని కోరారు. ట్రక్‌షీట్లు జనరేట్‌అయ్యాక మిల్లులకు వచ్చిన లోడ్లు త్వరగా అన్‌లోడ్ చేయించాలని సూచించారు. 48గంటల్లోనే డబ్బులు జమయ్యేందుకు వీలు గా లోడ్ దించిన వెంటనే ఎక్‌నాలెడ్జ్‌మెంట్ చేయాలని చెప్పారు.

వినతుల పరిష్కారంపై దృష్టి పెట్టండి: కలెక్టర్


పతాకనిధికి విరాళం ఇస్తున్న కలెక్టర్ అంబేడ్కర్

విజయనగరం, కలెక్టరేట్, డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి) రెవెన్యూ సదస్సుల్లో వచ్చే వినతుల్లో అవకాశం ఉన్న వాటిని అక్కడికక్కడే పరిష్కరించడంపై దృష్టి పెట్టాలని కలెక్టర్ బీఆర్ అంబేడ్కర్ ఆదేశించారు. అందుబాటులో ఉన్న సిబ్బందితో అప్పటికప్పుడు క్షేత్ర స్థాయిలో తనిఖీ చేయించి, వెంటవెంటనే సమస్యలను పరిష్కరించాలని సూచించారు. శనివారం రాత్రి కలెక్టరు అంబేడ్కర్ జేసీ సేతు మాధవన్, ఆర్డీవోలు, తహసీల్దార్లు , రెవెన్యూ సిబ్బందితో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా మొదటిరోజు జిల్లా వ్యాప్తంగా 39 గ్రామాల్లో నిర్వహించిన రెవెన్యూసదస్సుల్లో 533 వినతులు అందగా వాటిని ఆన్‌లైన్ చేయడంపై మండలాల వారీగా సమీక్షించారు. కార్య క్రమంలో డీఆర్వో శ్రీనివాసమూర్తి, నియోజకవర్గం ప్రత్యేకాధికారులు పాల్గొన్నారు.

సైనికుల సేవలు మరవలేం

సైనికులు దేశభక్తి, సాహసం, త్యాగాలు,సేవలు మరవలేమని కలెక్టరు అంబేడ్కర్ కొనియాడారు. సాయుధదళాల పతాకదినోత్సవం పురస్కరించుకుని కలెక్టరేట్ వద్ద పతాక నిధి ఫ్లాగ్‌ను ఆయన అందించారు.ఈసందర్భంగా కలెక్టరు మాట్లాడుతూ పాకిస్తాన్, చైనా యుద్ధ సమయాల్లో, కార్గిల్ పోరాటంలో సైనికుల త్యాగాలు మరలేమన్నారు. దేశం కోసం ప్రాణాలర్పించారని, అటువంటి వారి కుటుంబాలకు తమ వంతు సాయం అందించాలని పిలుపునిచ్చారు.కార్యక్రమంలో జిల్లా సైనిక సంక్షేమ అధికారి మజ్జి కృష్ణరావు పాల్గొన్నారు.

యువత కలలు సాకారం చేసుకోవాలి

● ఎల్అండ్‌టీ చైర్మన్ సుబ్రహ్మణ్యన్ పిలుపు


జ్యోతి ప్రజల్వన చేస్తున్న సుబ్రహ్మణ్యన్, జీఎంఆర్

రాజాం రూరల్, డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి):యువత కలలను సాకారం చేసుకోవాలని ఎల్అండ్‌టీ చైర్మన్ అండ్ మేనేజింగ్ డైరెక్టర్ ఎస్.ఎన్ సుబ్రహ్మణ్యన్ పిలుపునిచ్చారు. శనివారం రాజాంలోని జీఆర్ఐటీ ప్రాంగణంలో జీఆర్ గ్రూప్ ఆఫ్ కంపెనీస్ చైర్మన్ గ్రంధి మల్లిఖార్జునరావుతో కలిసి నిర్వహించిన కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా యువతకు దిశా నిర్దేశంచేశారు. జీవితంలో సక్సెస్ అయ్యేందుకు అవసరమైన పదిసూత్రాలను పవర్ ప్రెజెంటేషన్ ద్వారా వివరించారు. యువత జీఎంఆర్‌ను ఆదర్శంగా తీసుకుని విజయం దిశగా అడుగులు వేయాలని పిలుపునిచ్చారు.జీఎంఆర్ గ్రూపు ఆఫ్ కంపెనీస్ చైర్మన్ గ్రంధి మల్లిఖార్జునరావు మాట్లాడుతూ పట్టణంలో మెరుగైన విద్య, వైద్య సౌకర్యాలు కల్పించాలన్న లక్ష్యంతో కేజీ నుంచి పీజీ వరకూ విద్యాసంస్థలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఇంజనీరింగ్ విద్యార్థులు ప్రదర్శించిన ఎగ్జిబిషన్‌ను పరిశీలించి విద్యార్థులతో వారిద్దరూ మాట్లాడారు. కార్యక్రమంలో పారిశ్రామిక వేత్తలు గ్రంధి రాజేష్, బొమ్మిడాల శ్రీనివాస్‌తో పాటు జీఎంఆర్ సోదరులు పెదబాబు, చిన్నబాబు, గ్రంధి ఈశ్వరరావు పాల్గొన్నారు.

తప్పుడు మస్తర్లను సహించేది లేదు: పీడీ

రేగిడి, డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి):ఉపాధి హామీ పథకం పనుల్లో తప్పుడు మస్తర్లను సహించేదిలేదని మండలపరిషత్ ప్రత్యేకాధికారి, డీఆర్‌డీఏ పీడీ కల్యాణచక్రవర్తి సిబ్బందిని హెచ్చరించారు. శనివారం పనసలవలసలోగల కొనేరుచెరువులో ఉపాధి పనులను పరిశీలించారు. ఈసందర్భంగా మేట్ దగ్గరఉన్న ఆన్‌లైన్‌జాబితా ప్రకారం వేతనదారుల హాజరును పీడీ తనిఖీచేశారు. ఒకరికి బదులు మరొకరు పనులకు రావడం, నలుగురు వేతనదారులు పనిప్రదేశంలో లేకపోవడం గుర్తించి మేట్, ఫీల్డ్‌అసిస్టెంట్ రమేష్‌ను పీడీ వివరణ కోరారు. బినామీ మస్తర్లువేస్తే చర్యలకు సిఫారసు చేస్తామని హెచ్చరించారు.

రోడ్డు పనుల్లో నాణ్యతా ప్రమాణాలు పాటించాలి

వంగర డిసెంబరు7(ఆంధ్రజ్యోతి):రోడ్డు పనుల్లో నాణ్యతా ప్రమాణాలు పాటించాలని ఎంపీడీవో త్రినాథరావు కోరారు. మగ్గూరుల కల్వర్టు, డ్రెయిన్, సీసీ రోడ్డుపనులు పరిశీలించారు.కార్యక్రమంలో టీడీపీనాయకుడు అప్పలనాయుడు, ఏఈప్రభాకర్ పాల్గొన్నారు.

సదస్సు నిర్వహించక.. సమస్యలు చెప్పుకోలేక

●రావాడలో నిరాశతో వెనుదిరిగిన అర్జీదారులు

భోగాపురం, డిసెంబరు7(ఆంధ్రజ్యోతి): మండలంలోని రావాడలో శనివారం భూసమస్యలపై అర్జీలు చేసుకొనేందుకు వచ్చినవారు రెవెన్యూ సదస్సు నిర్వహించకపోవడంతో నిరాశతో వెనుతిరిగారు. రావాడలో శనివారం రెవెన్యూ సదస్సు నిర్వహిస్తామని, భూసమస్యలు, రెవెన్యూపరంగా ఎటువంటి సమస్యలు ఉన్నా సదస్సుకు హాజరై వినతులు అందజేయాలనిగ్రామంలో శుక్రవారం దండోరావేశారు.దీంతో భూసమస్యలు ఉన్న వారుతో పాటు స్థానికులు శనివారం రావాడ సచివాలయం వద్దకువచ్చారు. అయితే అన్ని ప్రభుత్వ పాఠశాలల్లో తల్లిదండ్రుల సమావేశం నిర్వహించడంతో రావాడలో నిర్వహించవలిసిన రెవెన్యూ సదస్సును అధికారులు నిలిపివేశారు. దీంతో తమ రెవెన్యూసమస్యలు అధికారులకు చెప్పులేకపోవడంతో అర్జీదారులు నిరాశచెందారు. కాగా సదస్సు రద్దుకావడంపై గ్రామంలో ప్రచారంచేయాలని వీఆర్వోని ఆదేశించామని తహసీల్దార్ సురేష్ తెలిపారు. అయితే ప్రజలకు సమాచారం అందిఉండదని, ఈవిషయంపై వీఆర్వోను అడుగుతామని చెప్పారు.

పారిశుధ్య కార్మికుల నిరసన

కొత్తవలస, డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి): పారిశుధ్యకార్మికులకు సన్మానాలు చేయడం కాదని వారికి జీతాలను వెంటనే చెల్లించాలని ఆ సంఘం జిల్లా కార్యదర్శి మద్దిల రమణ, జిల్లా వ్యవసాయ కార్మిక సంఘం అధ్యక్షుడు గాడి అప్పారావు డిమాండ్ చేశారు. శనివారం కొత్తవలస ఎంపీడీవో కార్యాలయ ఆవరణలో పారిశుధ్య కార్మికులతో నిరసన తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పారిశుధ్య కార్మికులకు సన్మానాలు చేయడం వల్ల ఒరిగేది లేదన్నారు. ప్రాణాలను సైతం పణంగా పెట్టి పనిచేస్తున్నారని, అటువంటి కార్మికులకు ప్రభుత్వ నెలలు తరబడి జీతాలు ఇవ్వకపోతే ఎలా కుటుంబాలను పోషించుకుంటారని ప్రశ్నించారు. పారిశుధ్య కార్మికులకు బకాయి ఉన్న నాలుగు నుంచి 12 నెలల వరకు జీతాలు వెంటనే చెల్లించాలని కోరారు. ఈ మేరకు ఎంపీడీవో కార్యాలయ సూపరింటెండెంట్ నాగేంద్రప్రసాద్‌కు, ఈవోపీఆర్డీకి వినతిపత్రాలను అందజేశారు.

ఫార్మసీ రంగం అభివృద్ధిలో ఏఐ కీలకపాత్ర

విజయనగరం టౌన్, డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి): ఫార్మసీ రంగం అభివృద్ధిలో ఆర్టిఫిషియల్ ఇంటలిజెన్స్ (ఏఐ), మెషిన్ లెర్నింగ్ కీలకపాత్ర పోషిస్తాయని హైదరాబాద్‌కు చెందిన నోవర్టీస్ డైరెక్టర్ డాక్టర్ వినోద్ బాలకృష్ణ నాయర్ తెలిపారు. విజయనగరం ఫూల్‌బాగ్‌లోని మహరాజా ఫార్మసీ కళాశాలలో మూడురోజులుగా జరిగిన ఫార్మా ఎపెక్సియో ఫెస్ట్- 2024 శనివారం ముగిసింది. కార్యక్రమంలో అయిజంట్ డ్రగ్ రీసెర్చ్ సొల్యూషన్ ప్రైవేట్ లిమిటెడ్ ప్రెసిడెంట్ డాక్టర్ విజయ్ రైనా, ఏపీ ఫార్మసీ కౌన్సిల్ రిజిస్ట్రార్ డాక్టర్ విలియం కేరీ, ఎంఆర్ ఫార్మసీ కళాశాల ప్రిన్సిపాల్ పి.ఉదయ్‌శంకర్ పాల్గొన్నారు.

పాలిటెక్ ఫెస్ట్‌తో సమాజానికి మేలు

● సాంకేతిక విద్యాశాఖ డిప్యూటీ డైరెక్టర్ రామకృష్ణ

విజయనగరం టౌన్, డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి): పాలిటెక్ ఫెస్ట్ వంటి ప్రదర్శనలు విద్యార్థులకే కాకుండా సమాజానికి ఎంతోమేలు చేస్తాయని సాంకేతిక విద్యాశాఖ డిప్యూటీ డైరెక్టర్ ఎంవీవీ రామకృష్ణ తెలిపారు. శనివారం విజయనగరంలోని ఫూల్‌బాగ్‌లో గల ఎంఆర్ఏజీఆర్ ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో రెండురోజులుగా నిర్వహిస్తున్న ప్రాంతీయ పాలిటెక్ ఫెస్ట్- 2024-25 వేడుకలు ముగిశాయి. ఈ సందర్భంగా విద్యార్థులు ప్రదర్శించిన వాటిలో అత్యుత్తమమైన 15 ప్రాజెక్టులను ఎంపికచేసి వారికి జ్ఞాపికలు అందజేశారు.వ్యవసాయ డ్రోన్ ప్రాజెక్టుకు మొదటి బహుమతి రాగా రూ.25 వేలు, స్మార్ట్ వెహికల్ డిటెక్షన్‌ప్రాజెక్టుకు రెండోబహుమతి రాగారూ.10 వేలు అందజేశారు. కార్యక్రమంలోఇండస్ట్రీస్ డిప్యూటీ డైరెక్టర్ మధుసూదనరెడ్డి, చీపురుపల్లి పాలిటెక్నిక్ కళాశాల ప్రిన్సిపాల్, డాక్టర్ ఎల్.విజయలక్ష్మి, ఎంఆర్ఏజెఆర్ ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల ప్రిన్సిపాల్ జె.ఆశారమణి, మెకానికల్ విభాగధిపతి డాక్టర్ జి.సత్యనారాయణ పాల్గొన్నారు.

సీనియర్స్ టెన్నిస్‌లో సత్తాచాటిన క్రీడాకారులు

విజయనగరం టౌన్, డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి):విజయనగరం క్రీడాకారులు జీవీకె ఆల్ ఇండియా సీనియర్స్ టెన్నిస్‌అసోసియేషన్ ఆధ్వర్యంలో హైదరాబాద్‌లో నిర్వహిస్తున్న సీనియర్స్ టెన్నిస్ చాంపియన్‌షిప్ పోటీల్లో సత్తాచాటారు. 65 ప్లస్ డబుల్స్ విభాగంలో జి.సన్యాసిరాజు, శ్రీనివాసరెడ్డి జోడి విజేతులుగా నిలవగా, 45 ప్లస్ విభాగంలో సౌమిత్రి, దినకర్‌రెడ్డి జోడి ఫైనల్స్‌కు చేరుకున్నారు. ఈమేరకు సన్యాసిరాజు సౌమిత్రిలను విజయనగరం ఆఫీసర్స్ క్లబ్ టెన్నిస్ క్రీడాకారులు వెంకట అప్పారావు, రాంబాబు, గాంధీ, శంకరరావు, రామారావు, చీఫ్ కోచ్ పెడ్రిక్, మల్లిక్ అభినందించారు.

నూతన వరి వంగడాలతో అధిక దిగుబడి

డెంకాడ, డిసెంబరు 7(ఆంధ్రజ్యోతి):నూతన వరి వంగడాలతో అధిక దిగుబడి సాధించవచ్చని విజయనగరం ఏరువాక కేంద్రం సమన్వయకర్త కె.లక్ష్మణరావు తెలిపారు. శనివారం డెంకాడ అభ్యుదయ రైతు కేవీఎస్ఎన్ పాణిరాజు పొలంలో ఎన్‌జీ రంగా వ్యవసాయవర్సిటీ, మార్టెరు, రాగోలు వ్యవసాయ పరిశోధన కేంద్రాలు సంయుక్తంగా సిరుసంచులపై (మినీకిట్స్) నూతనవరి వంగడాల పంట కోత ప్రయోగంలో నిర్వహించారు. కార్యక్రమంలో ఏవో పి.నిర్మల, ఏఈవో రామకోటి, నైరా కాలేజ్ విద్యార్థులు పాల్గొన్నారు.

మంత్రి నాదెండ్లను కలిసిన కూటమి నేతలు

గజపతినగరం డిసెంబరు 7(ఆంధ్రజ్యోతి): పౌరసరఫరాలశాఖ మంత్రి నాదెండ్ల మనోహర్‌ను కూటమి నేతలు, జనసేన నియోజకవర్గ ఇన్‌చార్జి మర్రాపు సురేష్, జనసేన పీఏసీ సభ్యురాలు పడాలఅరుణ, మాజీ ఎంపీపీ గంట్యాడ శ్రీదేవి, సర్పంచ్ లెంక రామలక్ష్మి, టీడీపీ నాయకులు పీవీవీ గోపాలరాజు, ప్రదీప్‌కుమార్ తదితరులు కలిశారు. ఈ మేరకు స్థానిక పీఏసీఎస్ కార్యాలయం వద్ద మన్యం జిల్లా పర్యటనలో భాగంగా విజయనగరం నుంచి వస్తుండగా శనివారం కలిశారు.

వాడీవేడిగా మండల సమావేశం

లక్కవరపుకోట, డిసెంబరు 7(ఆంధ్రజ్యోతి): ఎల్.కోట మండల సమావేశం వాడీవేడిగా జరిగింది. శనివారం ఎంపీపీ గేదెల శ్రీనివాసరావు అధ్యక్షతన మండల పరిషత్ సమావేశం జరిగింది. పంచాయతీ తీర్మానాలు లేకుండా ఉపాధి పనులు, పశువుల షెడ్లు ఎలా కేటాయించారని ఎంపీపీ అధికారులను ప్రశ్నించారు. దీంతో తలారి సర్పంచ్ ప్రతినిధి, టీడీపీనాయకుడు గుమ్మడి ప్రసాద్ స్పందించి మాట్లాడుతూ గత ప్రభుత్వ హయాంలో పంచాయతీ తీర్మానాలు లేకుండానే నిధులు కాజేశారని, ప్రశ్నించే నైతిక హక్కు మీకు లేదని, ఎన్నో దోపిడీలు చేశారని ధ్వజమెత్తారు. గత ప్రభుత్వం హయాంలో మీరు ఏమిచేశారో గుర్తు లేదా, మమ్మల్ని, అధికారులను ప్రశ్నించే హక్కు వైసీపీ నేతలకు లేదని పేర్కొన్నారు. ఆ సమయంలో ఇద్దరి మధ్య మాటామాటా పెరిగి తీవ్ర స్థాయిలో వాగ్వాదం చోటుచేసుకుంది. దీంతో ఎమ్మెల్సీ రఘురాజు కలుగజేసుకొని ఇద్దరికి సర్దిచెప్పారు. అనంతరం సభ సాగింది. కార్యక్రమంలో ఎంపీడీవో అప్పారావు, మండల స్థాయి అధికారులు పాల్గొన్నారు.

సుస్థిరాభివృద్ధితో జీవన ప్రమాణాలు మెరుగు: సీఈవో



మాట్లాడుతున్న సత్యనారాయణ

విజయనగరం టౌన్, డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి): సుస్థిరాభివృద్ధి లక్ష్యాలతో ప్రజల జీవన ప్రమాణాలు మెరుగవుతాయని జడ్పీ సీఈవో బీవీ సత్యనారాయణ తెలిపారు. విజయనగరంలోని జిల్లా పరిషత్ సమావేశ మందిరంలో ఈనెల నాలుగో తేదీ నుంచి సుస్థిరాభివృద్ధి లక్ష్యాలపై మాస్టర్ ట్రైనీలను నిర్వహిస్తున్న శిక్షణ కార్యక్రమం శనివారంతో ముగిసింది. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రజల జీవన ప్రమాణాలకు మెరుగుపరచడానికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అనేక పథకాలు అమలు చేస్తున్నాయని తెలిపారు. సుసిరాభివృద్ధి లక్ష్యాల ప్రాధాన్యతను క్షేత్ర స్థాయికి తీసుకువెళ్లడంలో మండల స్థాయి మాస్టర్ ట్రైనర్లు కృషి చేయాలన్నారు. ఈనెల 10 నుంచి 19 వరకు మండల స్థాయిలో నిర్వహించే శిక్షణకార్యక్రమాలను విజయవంతం చేయాలన్నారు. అనంతరం బాల్య వివాహాల నివారణపై ప్రతిజ్ఞ నిర్వహించారు. ఉమ్మడి జిల్లా నుంచి 206 మంది మాస్టర్ ట్రైనీలను శిక్షణా కార్యక్రమానికి ఎంపిక చేయగా 211 మంది హాజరయ్యారు. కార్యక్రమంలో ఎన్ఐఆర్‌డీపీఆర్ కన్సలెంట్ నాగరాజు, సామర్లకోట విస్తరణ శిక్షణకేంద్రం ఫ్యాకల్టీ సభ్యులు శ్రీనివాసరావు, పద్మజ, జిల్లా శిక్షణా మేనేజర్ దేవుడు, ఎస్‌బీఎం జిల్లా కన్సల్టెంట్ సుధాకర్, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

సంతకు గొర్రెలు తీసుకువెళ్తుండగా..

●బస్సు ఢీకొని ఒకరు దుర్మరణం.. మరో ఇద్దరికి గాయాలు


మహేష్ (ఫైల్)

దత్తిరాజేరు, డిసెంబరు 7(ఆంధ్రజ్యోతి): మండలంలోని పెదమానాపురం సంతతోట వద్ద శనివారం తెల్లవారుజామున ఆర్టీసీబస్సు ఢీకొనడంతో ఒకరు దుర్మరణం పాలయ్యాడు. మరో ఇద్దరుగాయపడ్డారు.పెదమానాపురం ఎస్ఐ జయంతి కథనంమేరకు... మండలంలోని వంగర గ్రామానికి చెందిన గెంజిమహేష్(35), కొలుసు రమణ, తిరండి నరసింగరావు ప్రతివారం సంతకు గొర్రెలను తరలించేవారు. అలాగే శనివారం కూడా గొర్రెలను తరలిస్తుండగా రామభద్ర పురం వైపు నుంచి విశాఖ వెళ్తున్న ఆర్టీసీ బస్సు సంత బ్రిడ్జి దాటిన తర్వాత వెనుక నుంచి వచ్చి ఢీకొంది. దీంతో గెంజి మహేష్‌కు తీవ్ర గాయాలు కావడంతో అక్కడికక్కడే మృతిచెందాడు. మిగిలిన ఇద్దరికి తీవ్ర గాయాలుకావడంతో జిల్లా కేంద్రాసుపత్రికి తరలించారు. ఆరు గొర్రెలు కూడా అక్కడిక్కడే మృతిచెందగా మరో నాలుగు గాయపడి తర్వాత మృతిచెందాయి. కొలుసు రమణ పరిస్థితి విషమంగా ఉంది. గెంజి మహేష్‌కు భార్య వెంకట లక్ష్మి, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. భార్య వెంకటలక్ష్మి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశారు.కాగాగెంజి మహేష్ అన్నయ్య రామారావు ఏడాదిన్నర కిందట రోడ్డుప్రమాదంలో ఒడిశాలో మృతిచెందిన విషయంవిదితమే. ఇంతలోనే మహేష్ మృతితో కుటుంబ సభ్యులు రోదిస్తున్నారు.మహేష్ తండ్రి దివ్యాంగు డు కావడంతో కుటుంబభారమంతా ఆయనపైనేఉండేది. ఈతరుణంలో మహే ష్మృతితో తమపరిస్థితి అగమ్యగోచరంగా మారిందని కుటుంబసభ్యులు వాపో తున్నారు. మహేష్ మృతితో వంగరలో విషాద ఛాయలు అలముకున్నాయి.

పాము కాటుతో మహిళ మృతి

సంతకవిటి, డిసెంబరు 7(ఆంధ్రజ్యోతి): మండలంలోని అక్కరాపల్లిలో ఓ మహిళ పాముకాటుకు గురై మృతిచెందింది. ఎస్ఐ ఆర్.గోపాలరావు కథనం మేరకు.. అక్కరాపల్లికి చెందిన తూలుగు తవిటమ్మ (47) శనివారం కూలి పనుల నిమిత్తం పొలానికి వెళ్లింది. వరి దిబ్బలు వేస్తుండగా పాము కాటేసింది. దీంతో సంతకవిటి పీహెచ్‌సీకి తరలించగా అప్పటికే మృతిచెందినట్లు వైద్యులు నిర్ధారించారు. తవిటమ్మ పెద్ద కుమార్తె వెంపటాపు ద్రాక్షాయని ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం రాజాం సామాజిక ఆసుపత్రికి తరలించారు.

విజయనగరంలో ఆటో చోరీ

విజయనగరం క్రైం, డిసెంబరు 7: (ఆంధ్రజ్యోతి):విజయనగరంలోని వన్‌టౌన్ పోలీసుస్టేషన్ పరిధిలోని కలెక్టరేట్ గేటు సమీపంలో శుక్రవారం మధ్యాహ్నం ఒంటగి గంటకు పార్కింగ్ చేసిన ఆటో చోరీకి గురైంది. పోలీసుల కథనం మేరకు.. గంట్యాడ మండలంలోని కొర్లాం గ్రామానికి చెందిన నొడగల రమణ ఆటోలో గంట్యాడ నుంచి విజయనగరం వచ్చి కలెక్టరేట్ వద్ద ఆపాడు. టీ తాగేందుకు షాపునకు వెళ్లి వచ్చేలోపు పార్కింగ్ చేసిన స్థలంలో ఆటోలేదు. దీంతో చుట్టు పక్కల వెతికి దొరకకపోవడంతో వన్‌టౌన్ పోలీసు స్టేషన్‌కు వెళ్లి ఫిర్యాదు చేశాడు. దీంతో పోలీసులు సీసీ ఫుటేజీ ఆధారంగా పరిశీలిస్తున్నట్లు ఎస్ఐ సురేంద్రనాయుడు తెలిపారు.

పెద్దశిర్లాంలో ధాన్యం కుప్ప దగ్ధం

రేగిడి, డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పెద్దశిర్లాంలో శనివారం తెలవారుజామున జరిగిన అగ్నిప్రమాదంలో కౌలురైతు పాలవలస గోవిందరావుకు చెందిన రెండున్నర ఎకరాల ధాన్యం కుప్ప దగ్ధమయ్యింది. ప్రమాద సమాచారంపై రాజాం అగ్నిమాపక సిబ్బంది మంటలు అదుపులోకి తీసుకొచ్చారు. గుర్తుతెలియని వ్యక్తులు నిప్పుఅంటించడంతో ప్రమాదం జరిగిఉండొచ్చని కుటుంబ సభ్యులు అనుమానిస్తున్నారు. నిప్పంటించేందుకు ఉపయోగించిన దివిటిని ప్రమాదస్థలంలో బాధిత కుటుంబ సభ్యులు గుర్తించారు. రూ. 2లక్షల వరకు పంటనష్టం జరిగి ఉంటుందని స్థానికులు అంచనావేస్తున్నారు.

నాయిరాలవలసలో గడ్డివాము..

మండలంలో నాయిరాలవలసలో శనివారం కొవ్వాడరామయ్యకు చెం దిని ఎకరన్నర వరిగడ్డివాము దగ్ధమైంది. సమాచారం మేరకు పాలకొండఅగ్నిమాపకసిబ్బంది చేరుకొని మంటలు అదుపులోకి తీసుకొచ్చారు. పదివేల వరకు నష్టం ఉంటుందనిఅగ్నిమాపకసిబ్బంది అంచనావేశారు. అటుగావెళ్లినవారు నిప్పురవ్వవిసిరడంతో ప్రమాదంజరిగిఉండొచ్చని స్థానికులు చెబుతున్నారు.

మత్తుపదార్థాలకు దూరంగా ఉండాలి

విజయనగరం క్రైం, డిసెంబరు 7: (ఆంధ్రజ్యోతి): విద్యార్థులు మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని టూటౌన్ ఎస్ఐ మురళి తెలిపారు. శనివా రం విజయనగరంలోని కస్పా స్కూల్‌లో మాదక ద్రవ్యాల వల్ల అనర్థాలపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈసందర్భంగా మాదక ద్రవ్యాలకు సంబంధించిన గోడ పత్రికను ఆవిష్కరించారు.

●వంగర, డిసెంబరు7(ఆంధ్రజ్యోతి): గ్రామాల్లో బెల్ట్ షాపులు నిర్వహిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని ఎస్ఐ షేక్‌శంకర్ హెచ్చరించారు. శనివారం అరసాడలో ప్రజలకు మద్యం వల్ల కలగే అనర్థాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా డ్రగ్స్ మిమ్మలినే కాదు - మీ కుటుంబాన్ని కూడా నాశనం చేస్తుందన్న పోస్టర్లు గ్రామంలోపలు చోట్ల ఏర్పాటుచేశారు.

● రాజాం, డిసెంబరు 7ఆంధ్రజ్యోతి):సారా నియంత్రనే లక్ష్యమని ఎక్సైజ్ సీఐ ఆర్.జైభీమ్ తెలిపారు.వంగర మండలంలోని నీలయ్యవలసలోసారా అమ్మకాలను నిరోదించేందుకు ప్రజలకు చైతన్యపరచడానికి అవగాహనకార్య క్రమం నిర్వహించారు. కార్యక్రమంలో ఎస్ఐ జి.మాన్యాలు, సిబ్బంది పాల్గొన్నారు

కార్పొరేషన్‌కు నిధుల కేటాయింపుపై హర్షం

విజయనగరం రూరల్, డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి): సీఎం చంద్ర బాబునాయుడు ఏపీ బ్రాహ్మణ వేల్ఫేర్ కార్పొరేషన్‌కు రూ.270 కోట్లు కేటాయించడం హర్షణీయమని రాష్ట్రీయ బ్రాహ్మణ సంఘటన జాతీయ అధ్యక్షుడు జంధ్యాల బుచ్చిబాబు, రాష్ట్ర ఉపాధ్యక్షుడు భోగాపురపు వాయునందన శర్మ, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు అయ్యల సోమయాజుల భద్రాద్రి ఒక ప్రకటనలో హర్షం వ్యక్తం చేశారు. ఈ నిధులను బ్రాహ్మణ సంక్షేమానికి వినియోగించాలని కోరారు.

ఉద్యోగులను కొనసాగించాలి

భోగాపురం,డిసెంబరు7(ఆంధ్రజ్యోతి):కోర్టుతీర్పు మేరకు జిల్లాలో 56 మంది హెల్త్‌మేల్ సహాయకుల ఉద్యోగులను తొలగిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేయడం విచారకరమని భోగాపురం తాలూకా ఏపీ ఎన్‌జీవో తాలూకా అధ్యక్షుడు కొమ్మూరుదుర్గారావు ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ప్రస్తుతం ప్రభుత్వం వీరందరిని కొనసాగించాలని కోరారు.

విద్యుత్ కార్మికుల సమస్యలు పరిష్కరించండి

● మంత్రి నాదెండ్ల దృష్టికి తీసుకువెళ్లిన నాయకులు

బొబ్బిలి, డిసెంబరు 7(ఆంధ్రజ్యోతి): మన్యం జిల్లా పర్యటనలో భాగంగా రాష్ట్ర పౌర సరఫరాల శాఖా మంత్రి నాదెండ్ల మనోహర్ శనివారం స్థానిక జనసైనికుల నిలయానికి విచ్చేశారు. ఈసందర్భంగా తెలుగునాడు విద్యుత్ కార్మిక సంఘం ప్రాంతీయ అధ్యక్షుడు బి.తేజేశ్వరరావు తదితరులు మంత్రికి పలు సమస్యలపై వినతిపత్రం అందజేశారు. రెగ్యులర్ ఉద్యోగులకు అమలులో ఉన్న మూల వేతనాన్ని కనీస వేతనంగా నిర్ణయించి అమలు చేయాలని కోరారు. దళారీ వ్యవస్థను రద్దు చేసి నేరుగా వేతన చెల్లింపులు జరపాలని, 2022 పీఆర్సీలో కాంట్రాక్టు కార్మికులకు పీఆర్సీ ఎరియర్స్ చెల్లించాలని కోరారు. ఇలా వివిధ సమస్యలను ఆయన దృష్టికి తీసుకు వెళ్లారు. దీనిపై మంత్రి సానుకూలంగా స్పందిస్తూ సీఎం దృష్టికి తీసుకు వెళ్తానని హామీ ఇచ్చారు.

నాదెండ్లకు ఘన స్వాగతం

రాష్ట్ర మంత్రి నాదెండ్ల మనోహర్‌కు బొబ్బిలి పట్టణంలో జనసేన పార్టీ స్థానిక నాయకుడు పాలూరి బాబు ఆధ్వర్యంలో ఘన స్వాగతం పలికారు. బొబ్బిలి మీదుగా శనివారం పార్వతీపురం వెళ్తున్న మంత్రి మనోహర్‌కు స్థానిక పెట్రోలు బంకు జంక్షన్‌లో జనసైనికులు స్వాగతం పలుకుతూ గజమాల వేశారు. అనంతరం పార్టీ కార్యాలయానికి తీసుకువెళ్లారు. జన సైనికుడు రేవళ్ల కిరణ్‌కుమార్, వీర మహిళ బంటుపల్లి దివ్య తదితరులు పాల్గొన్నారు.

● సీతానగరం, డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర పౌర సరఫరాలశాఖ మంత్రిగా బాధ్యతలు చేపట్టిన తర్వాత తొలిసారిగా జిల్లాకు వచ్చిన నాదెండ్ల మనోహర్‌కు ఎమ్మెల్యే బోనెల విజయచంద్ర, కూటమి నాయకులు, రైస్ మిల్లర్ల సంక్షేమ సంఘం జిల్లా నాయకులు లచ్చయ్యపేట వద్ద ఘన స్వాగతం పలికారు. మాజీ సర్పంచ్ వి.సూర్యకుమారి ఆధ్వర్యంలో మహిళలు హారతులు ఇచ్చారు. బీజేపీ జిల్లా అధ్యక్షుడు ద్వారపురెడ్డి శ్రీనివాసరావు, రైస్ మిల్లర్ల సంఘం జిల్లా అధ్యక్షుడు రవి మాస్టారు, టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

అంతర్రాష్ట్ర రహదారిపై తప్పిన ప్రమాదం

● వెనుక నుంచి లారీని ఢీకొన్న మరో లారీ

● రెండు గంటలపాటు నిలిచిన ట్రాఫిక్


ప్రమాదంలో లారీ ముందు భాగం నుజ్జయిన దృశ్యం

కొమరాడ, డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి): అంతర్రాష్ట్ర రహదారిపై శనివారం ముందు వెళ్తున్న లారీని వెనుక నుంచి వచ్చిన లారీ బలంగా ఢీకొంది. దీంతో రెండు గంటల పాటు ట్రాఫిక్ నిలిచిపోయింది. శనివారం ఉదయం పార్వతీపురం వైపు నుంచి రాయగడ వైపు వెళ్తున్న లారీలు కొమరాడ గ్రామ సమీపంలో ఢీకొన్నాయి. అయితే ఈ ప్రమాదంలో లారీ డ్రైవర్లు స్వల్ప గాయాలతో బయటపడినట్టు స్థానికులు చెబుతున్నారు. విషయం తెలుసుకున్న కొమరాడ పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని ట్రాఫిక్ లేకుండా చర్యలు తీసుకున్నారు. కొమరాడ పోలీసులు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నారు.

బ్యాంకు గ్యారంటీలు సమర్పించాలి

బొబ్బిలి రూరల్, డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి): మిల్లుల మిల్లింగ్ సామర్థ్యం ప్రకారం బ్యాంకు గ్యారంటీలు సమర్పించాలని తహసీల్దార్ ఎం.శ్రీను ఆదేశించారు. శనివారం స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో మండలంలో గల రైస్ మిల్లర్లు, పీఏసీఎస్, ఎఫ్‌పీవోలతో ఆయన సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ బ్యాంక్ గ్యారంటీలను సమర్పించకపోతే చర్యలు తప్పవని హెచ్చరించారు. అలాగే ధాన్యం కొనుగోలులో మిల్లర్లు అలసత్వం వహిస్తే చర్యలు తప్పవన్నారు. రైతులు తెచ్చిన ధాన్యానికి కొర్రీలు వేయకుండా నిబంధనలు ప్రకారం కొనుగోలు చేయాలని ఆదేశించారు. కస్టోడియన్ అధికారిగా వీఆర్వో బాధ్యతగా వ్యవహరించాలన్నారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ అధికారి శ్యామ్‌సుందర్, సీఎస్‌డీటీ సాయికృష్ణ, మిల్లర్లు, పీఏసీఎస్ సిబ్బంది పాల్గొన్నారు.

సారాతో వ్యక్తి అరెస్టు

బొబ్బిలి రూరల్, డిసెంబరు 7(ఆంధ్రజ్యోతి): కొయ్యకొండవలస గ్రామ పరిధిలో శనివారం ఐదు లీటర్ల సారాతో పుంగారి జయన్న అనే వ్యక్తిని అరెస్టు చేసి అదుపులోకి తీసుకుని జైలుకు పంపించామని బొబ్బిలి ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ సీఐ పి.చిన్నంనాయుడు తెలిపారు. స్థానికులు ఇచ్చిన సమాచారం మేరకు గ్రామంలో ఎస్ఐ శ్రావణ్‌కుమార్ ఆధ్వర్యంలో, హెడ్ కానిస్టేబుల్ మెట్ట శ్రీనివాసరావు, కానిస్టేబుల్ ప్రసాదరావు సిబ్బందితో దాడులు నిర్వహించామని చెప్పారు. ఈ దాడుల్లో సారాతో జయన్నను పట్టుకున్నామని తెలిపారు.

లేఅవుట్ల తనిఖీ


లబ్ధిదారులతో మాట్లాడుతున్న విజిలెన్స్ అధికారి కామేశ్వరరావు

మక్కువ, డిసెంబరు 7(ఆంధ్రజ్యోతి): మండలంలోని జగనన్న కాలనీ లేఅవుట్లను విజిలెన్స్ అధికారి అట్టాడ కామేశ్వరరావు శనివారం తనిఖీ చేశారు. ఎంత మేరకు ఇళ్ల నిర్మాణాలు పూర్తయ్యాయి.. నిజమైన అర్హులకు గృహాలు ఇచ్చారా.. అని ఆరా తీశారు. గృహ నిర్మాణాలు ఇంకా పూర్తి చేయని వారి వివరాలు నమోదు చేసుకున్నారు. కార్యక్రమంలో హౌసింగు ఏఈ ఎ.సింహాచలం, వర్క్ ఇన్‌స్పెక్టర్లు పైడితల్లి, రామకృష్ణ పాల్గొన్నారు.

సైకిల్, కిచెన్ షెడ్ల ప్రారంభం

పాలకొండ, డిసెంబరు 7(ఆంధ్రజ్యోతి): పాలకొండ మండలం భాసూరు గ్రామంలోని జడ్పీ ఉన్నత పాఠశాలలో ఈ ఏడాది కమాండో జర్నలిస్ట్ మంజేటి రామారావు సైకిల్, కిచెన్‌షెడ్‌లను నిర్మించి ఇస్తామని మాట ఇచ్చారు. ఈ మేరకు శనివారం వారి అన్నదమ్ములు సత్యంనాయుడు, కరిమినాయుడు, వెంకటరమణ వీటిని ప్రారంభించారు. రూ.25లక్షలతో విద్యార్థుల కోసం కిచెన్, సైకిల్ షెడ్లను నిర్మించి ఇచ్చిన దాతలకు పాఠశాల సిబ్బంది కృతజ్ఞతలు తెలిపారు. హెచ్‌ఎం నాగభూషణరావు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

నిత్యం ట్రాఫిక్

● ఇబ్బందులు పడుతున్న బొబ్బిలి పట్టణ వాసులు


బొబ్బిలిలో ట్రాఫిక్ నిలిచిన దృశ్యం

బొబ్బిలి, డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి): బొబ్బిలి పట్టణంలో నిత్యం ట్రాఫిక్ సమస్యతో వాహనదారులు, పాదచారులు నానా ఇబ్బందులు పడుతున్నారు. రోడ్ల వెడల్పు చేయకపోవడం, ఆక్రమణలతో ట్రాఫిక్ సమస్య వేధిస్తోంది.

పిల్లలపై బాధ్యతగా ఉండాలి

● జిల్లాలోని ప్రభుత్వ పాఠశాలల్లో తల్లిదండ్రులు, ఉపాధ్యాయుల ఆత్మీయ సమావేశం

● పాల్గొన్న ఎమ్మెల్యేలు, నాయకులు

విద్యార్థుల పట్ల తల్లిదండ్రులు బాధ్యతగా వ్యవహరించాలని స్థానిక ఎమ్మెల్యేలు సూచించారు. ఉమ్మడి జిల్లాలోని అన్ని ప్రభుత్వ పాఠశాలల్లో శనివారం తల్లిదండ్రులు, ఉపాధ్యాయుల ఆత్మీయ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశాలను ఆయా పాఠశాలల హెచ్‌ఎం ఆధ్వర్యంలో పండగను తలపించేలా నిర్వహించారు. ఈ కార్యక్రమాల్లో ఎమ్మెల్యేలు, కూటమి నాయకులు, అధికారులు పాల్గొని, తల్లిదండ్రులను ఉద్దేశించి మాట్లాడారు. విద్యార్థుల చదువు పట్ల తల్లిదండ్రులు కూడా శ్రద్ధ కనబరచాలని సూచించారు. ఉపాధ్యాయులు ఉత్తమ బోధనను అందించాలన్నారు. అనంతరం తల్లిదండ్రులు, ఉపాధ్యాయులతో ప్రతిజ్ఞ చేయించారు. పిల్లలతో పాటు తల్లిదండ్రులు, ప్రజాప్రతినిధులు కలిసి మధ్యాహ్న భోజనం చేశారు.
(ఆంధ్రజ్యోతి బృందం)


సీతంపేట రూరల్: గిరిజన సంక్షేమ ఆశ్రమ బాలుర ఉన్నత పాఠశాలలో మాట్లాడుతున్న పాలకొండ ఎమ్మెల్యే జయకృష్ణ


గుమ్మలక్ష్మీపురం: విద్యార్థుల తల్లిదండ్రులు, ఉపాధ్యాయులతో ప్రతిజ్ఞ చేయిస్తున్న కురుపాం ఎమ్మెల్యే జగదీశ్వరి


బాడంగి: విద్యార్థుల తండ్రులతో థగ్ ఆఫ్ వార్ ఆడుతున్న బుడా చైర్మన్ తెంటు లక్ష్మంనాయుడు


బొబ్బిలి రూరల్: పిరిడి జడ్పీ ఉన్నత పాఠశాల వద్ద విద్యార్థులు, అధికారులతో కలిసి భోజనం చేస్తున్న ఎమ్మెల్యే బేబీనాయన

భోజనాలు బాగోలేవంటూ ఆందోళన

పాచిపెంట, డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి): ఎండీఎం వంటకాలు రుచికరంగా లేవంటూ స్థానిక జడ్పీ హైస్కూల్ వద్ద విద్యార్థుల తల్లిదండ్రులు ఆందోళన వ్యక్తం చేశారు. శనివారం సమావేశంలో పాల్గొన్న విద్యార్థుల తల్లిదండ్రులు హెచ్‌ఎం బి.ఈశ్వరరావుపై విరుచుకుపడ్డారు. తల్లిదండ్రులు వచ్చిన రోజునే ఇలా భోజనాలు ఉంటే మిగతా రోజులు ఇంకెలా ఉంటాయోనని విమర్శించారు. అరకొరగా వంటకాలు చేయడంతో కొంతమంది తల్లిదండ్రులు ఆకలితో వెనుదిరిగారు. కమిటీ ఛైర్మన్ యడ్ల రమేష్ మాట్లాడుతూ విద్యార్థులకు రుచికరంగా వండి పెట్టాలంటూ పలుమార్లు హెచ్చరించినా పట్టించుకోవడం లేదని హెచ్‌ఎంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆఖరి క్షణంలో టీడీపీ మండల అధ్యక్షుడు పిన్నింటి ప్రసాద్ వచ్చి.. దయ చేసి సెలవుపై వెళ్లిపోవాలని హెచ్‌ఎంకు సూచించారు. ఎస్ఐ వెంకటసురేష్ గొడవను చల్లార్చారు.


పాచిపెంట: హెచ్‌ఎంను నిలదీస్తున్న తల్లిదండ్రులు


సాలూరు రూరల్: మాట్లాడుతున్న టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు భంజ్‌దేవ్

యువత అగ్నిపథ్‌లో చేరాలి

బెలగాం, డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి): యువత అగ్నిపథ్ స్కీంలో చేరేలా అడుగులు వేయాలని ఇండియన్ ఎయిర్‌ఫోర్స్ అథారిటీ కార్పొరల్ సందీప్ అన్నారు. శనివారం స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలోని ఆడిటోరియంలో అగ్నిపథ్, ఇండియన్ ఎయిర్ ఫోర్స్‌పై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో హైదరాబాద్ ఎయిర్ ఫోర్స్ అథారిటీ నుంచి కార్పొరల్ సందీప్, సార్జెంట్ ఎస్.డి.రౌట్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా సందీప్ మాట్లాడుతూ ఇంటర్‌లో 50 శాతం మార్కులు సాధించగలిగితే ఎయిర్‌ఫోర్స్‌లో ఉద్యోగానికి అర్హత ఉంటుందన్నారు. ఇంటర్‌లో బైపీసీ చదివిన విద్యార్థులకు అగ్నిపథ్ స్కీం కాకుండా ఎయిర్‌ఫోర్స్‌లో మెడికల్ అసిస్టెంట్ స్కీం ఉందని చెప్పారు. ఎయిర్ ఫోర్స్‌లో మెడికల్ అసిస్టెంట్ స్కీంలో చేరిన యువతకు పెన్షన్‌తో కూడిన 20 ఏళ్ల ఉద్యోగ కాలపరిమితి ఉంటుందని పేర్కొన్నారు. బైపీసీ చదువుకున్న విద్యార్థినులు మిలటరీ నర్సింగ్ సర్వీస్‌కు దరఖాస్తు చేసుకోవచ్చని చెప్పారు. అర్హత గల విద్యార్థులు దరఖాస్తు చేసుకోవాలని కోరారు. విద్యార్థులకు ఆయన పలు ప్రశ్నలు అడగగా గెలపొందిన వారికి బహుమతులు ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ఇంటర్మీడియట్ విద్యాశాఖాధికారి డి.మంజులవీణ, కళాశాల ప్రిన్సిపాల్ జె.రామారావు తదితరులు పాల్గొన్నారు.



విద్యార్థినికి బహుమతి ప్రదానం చేసున్న సందీప్, మంజులవీణ, తదితరులు

చెక్‌బౌన్స్ కేసులో వ్యక్తికి ఏడాది జైలు

పాలకొండ, డిసెంబరు 7(ఆంధ్రజ్యోతి): చెక్‌బౌన్స్ కేసులో వీరఘట్టం మండలం విక్రాంపురం గ్రామానికి చెందిన కె.విష్ణుమూర్తినాయుడు అనే వ్యక్తికి ఏడాది జైలు శిక్ష విధిస్తూ పాలకొండ జూనియర్ డివిజన్ జ్యుడీషియల్ ఫస్ట్‌క్లాస్ మెజిస్ట్రేట్ విజయ్‌కుమార్ తీర్పు ఇచ్చారు. శనివారం దీనికి సంబంధించి వివరాలను వెల్లడించారు. విక్రాంపురం గ్రామానికి చెందిన కె.విష్ణుమూర్తినాయుడు గతంలో పాలకొండకు చెందిన కె.సంతోష్‌కుమార్ వద్ద రూ.9.80లక్షలు అప్పు తీసుకున్నాడు. దీనికి సంబంధించి 2017లో చెక్‌బౌన్స్ కేసు నమోదు కావడంపై విష్ణుమూర్తినాయుడుకు ఏడాది జైలు శిక్ష విధిస్తున్నట్లు మెజిస్ట్రేట్ తీర్పు ఇచ్చారు.

సుబ్రహ్మణ్యస్వామికి ప్రత్యేక పూజలు

మార్గశిర మాసంలో పవిత్రమైన సుబ్రహ్మణ్యస్వామి షష్ఠి సందర్భంగా శనివారం ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా ఉన్న పలు దేవాలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించారు. స్వామివారిని ప్రత్యేకంగా అలంకరించారు. ఉత్సవ విగ్రహాన్ని పురవీధుల్లో ఊరేగించారు. పల ఆలయాల్లో స్వామివారి కల్యాణం నిర్వహించారు. ఈ పూజల్లో అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.
(ఆంధ్రజ్యోతి బృందం)


పార్వతీపురంటౌన్: పార్వతీదేవి ఆలయంలో..


రేగిడి: గోపంపేటలో పూజల్లో పాల్గొన్న మహిళలు


సాలూరు రూరల్: పారమ్మకొండపై సుబ్రహ్మణ్యస్వామి కల్యాణం


కొత్తవలస: కె.కోటపాడులో..


గజపతినగరం: ఎం.వెంకటాపురంలో పూల అలంకరణలో సుబ్రమణ్యస్వామి


శృంగవరపుకోట: సుబ్రహ్మణ్యస్వామి కల్యాణం నిర్వహిస్తున్న దృశ్యం


రాజాం: కంచరాంలో సుబ్రహ్మణ్యస్వామి విగ్రహాన్ని ఊరేగిస్తున్న దృశ్యం


బొబ్బిలి: గొల్లపల్లి సుబ్రహ్మణ్యస్వామి ఆలయంలో..


దిబ్బగుడ్డివలసలో వినియోగంలో లేని చెత్తసంపద కేంద్రం

చెత్త నుంచి సంపద ఏదీ?

● నిరుపయోగంగా ఎస్‌డబ్ల్యూపీసీలు ● పట్టించుకోని పాలకులు

బొబ్బిలి రూరల్, డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి): మండలంలోని దిబ్బగుడ్డివలస గ్రామ శివారులో నిర్మించిన చెత్త సంపద కేంద్రం(ఎస్‌డబ్ల్యూపీసీ) నిరుపయోగంగా మారింది. చెత్త నుంచి సంపద సృష్టించి పంచాయతీలకు ఆదాయం సమకూర్చడానికి గతంలో టీడీపీ ప్రభుత్వం ఎస్‌డబ్ల్యూపీసీలను ఏర్పాటు చేసింది. వైసీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత వీటిని విస్మరించింది. దీంతో లక్షలు వెచ్చించి నిర్మించిన ఈ కేంద్రాలు దిష్టి బొమ్మల్లా దర్శనమిస్తున్నాయి. బొబ్బిలి మండలంలోని 30 పంచాయతీలకు గాను 21 పంచాయతీల్లో ఎస్‌డబ్ల్యూపీసీలను నిర్మించారు. ఒక్కో కేంద్రం నిర్మాణానికి సుమారు రూ.5లక్షలు ఖర్చు చేశారు. చాలావరకు నిరుపయోగంగానే ఉన్నాయి. ఇప్పటికైనా కూటమి ప్రభుత్వం ముందుకు వచ్చి, వీటిని వినియోగంలోకి తీసుకురావాలని అందరూ కోరుతున్నారు.

వినియోగంలోకి తీసుకు వస్తాం

ఈ విషయంపై మండల ఈవోపీఆర్డీ భాస్కరరావుని సంప్రదించగా, వీటిని త్వరలో వినియోగంలోకి తీసుకు వస్తామని తెలిపారు. ఆయా పంచాయతీలకు ఆదాయం సమకూరేలా చర్యలు చేపడతామని చెప్పారు.

మహాసభలు జయప్రదం చేయండి

సీతంపేట రూరల్, డిసెంబరు 7(ఆంధ్రజ్యోతి): కురుపాంలో ఈనెల 10, 11వ తేదీల్లో నిర్వహించనున్న సీపీఎం పదో మహాసభలను జయప్ర దం చేయాలని పార్టీ నాయకులు ఎం.తిరుప తిరావు పిలుపునిచ్చారు. ఈ మేరకు శనివారం పోస్టర్‌ను ఆవిష్క రించారు. సీపీఎం నాయకులు ఎ.భాస్కరరావు, ఎం.కాం తారావు, పి.సాంబయ్య, పి.వీరన్న, జె.శ్రీరాములు పాల్గొన్నారు.

అగ్నిమాపక కేంద్రం తనిఖీ

పాలకొండ, డిసెంబరు 7(ఆంధ్రజ్యోతి): పాలకొండ పట్టణంలోని అగ్నిమాపక కేంద్రాన్ని అగ్నిమాపక అధికారి కె.శ్రీనుబాబు శనివారం తనిఖీ చేశారు. హోజు, లేడర్‌డ్రిల్‌లను ఆయన పరిశీలించారు. హెచ్‌జెమ్ కోడ్, పెట్రోల్ బైన్‌షాప్‌లపై సిబ్బందికి అవగాహన కల్పించారు. ఈసందర్భంగా పలు సూచనలు చేశారు.

ఖైదీలకు ఆట వస్తువుల పంపిణీ

ఒడిశా

రాయగడ, డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి): జైలు డే సందర్భంగా శనివారం స్థానిక యూత్ వాకర్స్ క్లబ్ సభ్యులు ఖైదీలకు వివిధ క్రీడా వస్తువులను పంపిణీ చేశారు. ఈసందర్భంగా క్లబ్ సభ్యులు మాట్లాడుతూ ఖైదీలకు మానసిక ప్రశాంతత కోసం క్యారమ్స్, చదరంగం, వాలీబల్ వంటి పలు క్రీడా వస్తువులు పంపిణీ చేసినట్టు తెలిపారు. క్లబ్ అధ్యక్షుడు వంశీ కిరీటి, ఉపాధ్యక్షుడు శ్రీవాస్తవ, కార్యదర్శి బరాటం అవంతి, విజయలక్ష్మి న్యాయవాది ఎం.సతీష్ తదితరులు పాల్గొన్నారు.

నిబంధనలు పాటించకుంటే చర్యలు తప్పవు


తనిఖీలు నిర్వహిస్తున్న ఎస్ఐ

గరుగుబిల్లి, డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి): వాహనదారులు నిబంధనలు పాటించకుంటే చర్యలు తప్పవని ఎస్ఐ పి.రమేష్‌నాయుడు హెచ్చరించారు. మండలంలోని ప్రధాన రహదారిలో ఆయన శనివారం వాహన తనిఖీలు నిర్వహించారు. పరిమితికి మించి ప్రయాణికులను తరలించరాదన్నారు. గంజాయి, సారా వంటి వాటి రవాణాకు ప్రోత్సహిస్తే చర్యలు తప్పవన్నారు. రహదారికి ఆనుకుని ఉన్న పిచ్చిమొక్కలను సిబ్బందితో కలిసి తొలగించారు. కార్యక్రమంలో సిబ్బంది బి.రాము, శంకరరావు, తదితరులు పాల్గొన్నారు.